1,947కే విమాన టికెట్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్

న్యూఢిల్లీ, ఆగస్టు 2: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్..77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్రీడం సేల్ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,947గా నిర్ణయించింది. ఈ నెల 5 లోపు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 30లోగా ప్రయాణించాల్సి ఉంటుందని పేర్కొంది.

లాభాల్లో మెడ్‌ప్లస్

హైదరాబాద్, ఆగస్టు 2: రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఔషధ విక్రయ సంస్థ మెడ్‌ప్లస్ హెల్త్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.14.36 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ ఆదాయం కూడా ఏడాది ప్రాతిపదికన 16 శాతం ఎగబాకి రూ.1,489 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది.

ఇంటింటా ఇన్నోవేటర్ గడువు పొడిగింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఇంటింటా ఇన్నోవేటర్-2024కు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగిస్తున్నట్టు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రకటించింది. ఆవిష్కర్తలు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 10 వరకు అవకాశం ఉందని పేర్కొంది. ఆవిష్కరణలను 9100678543 వాట్సప్ నంబర్‌కు పంపించాలని సూచించారు.

6న ఏఐపై వర్క్‌షాపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో కలిసి ఈ నెల 6న వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు టీ హబ్ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వాడుకలోకి వచ్చిన ఏఐ టూల్స్ తరహాలో పరిశ్రమల అవసరాల కోసం ఉత్పాదక (జనరేటివ్)ఏఐపై ఆవిష్కర్తలు, స్టార్టప్ నిర్వాహకులు సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా అమెజాన్ వెబ్ సర్వీసు (ఎడబ్ల్యుఎస్) సహకారంతో ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని, ఔత్సాహికులు టీ హబ్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని టీ హబ్ ప్రతినిధి తెలిపారు.

4.5 లక్షల కోట్లు ఔట్

స్టాక్ మార్కెట్ నష్టాలతో ఒక్కరోజే భారీగా ఆవిరైన సంపద

రికార్డు గరిష్ఠాల నుంచి సూచీలు వెనుకకు • సెన్సెక్స్ 886, నిఫ్టీ 293 పాయింట్లు పతనం

తీవ్ర అమ్మకాల ఒత్తిడిలో మదుపరులు

ముంబై, ఆగస్టు 2: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్ పడింది. శుక్రవారం మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు బలహీనంగా నమోదు కావడం అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లకు రుచించలేదు. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపైనా పడింది. ఆల్‌టైమ్ హైల్లో సూచీలు ఉండటంతోనూ ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణకు వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే భారీ నష్టాలు వాటిల్లాయి. ఫలితంగా 5 రోజుల లాభాలకు తెరపడినట్టైంది. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 885.60 పాయింట్లు లేదా 1.08 శాతం క్షీణించి 80,981.95 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 998.64 పాయింట్లు పడిపోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 293.20 పాయింట్లు లేదా 1.17 శాతం పతనమై 24,717.70 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలోనైతే గరిష్ఠంగా 324.05 పాయింట్లు నష్టపోయింది.

రంగాలవారీగా..

రియల్టీ షేర్లు అత్యధికంగా 3.56 శాతం నష్టపోయాయి. మెటల్ 3 శాతం, ఆటో 2.97 శాతం, ఐటీ 2.05 శాతం, కమోడిటీస్ 1.83 శాతం, టెక్నాలజీ 1.79 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.70 శాతం చొప్పున క్షీణించాయి. ఇక మారుతీ సుజుకీ, టాటా మోటర్స్, జేఎస్ డబ్ల్యూ స్టీల్, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేక నష్టాలను మూటగట్టుకున్నాయి. జూలైలో పడిపోయిన వాహన విక్రయాలతో ఆటో కంపెనీల షేర్లు, ఇన్ఫోసిస్‌కు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నోటీసుల కలకలంతో ఐటీ సంస్థల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ 0.58 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం చొప్పున పడిపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులను పరిశీలిస్తే.. ప్రధాన ఆసియా మార్కెట్లలో జపాన్, చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఐరోపాలోని కీలక దేశాల స్టాక్ మార్కెట్ల పరిస్థితీ ఇలాగే ఉన్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నలా భావించే అమెరికాలో మరోమారు ఆర్థిక మాంద్యం ఛాయలు అలుముకుంటున్నాయా? అన్న అంచనాల నడుమ మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. ఈ పరిణామం భారత్‌సహా అన్ని దేశాల ఈక్విటీ మార్కెట్లను కుదిపేసినట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. జూలైలో ఐఎస్‌ఎం తయారీ సూచీ 46.6కు దిగజారింది. దీంతో మాంద్యం భయాలు మళ్లీ నెలకొన్నాయని అంటున్నారు. అలాగే ఇజ్రాయెల్-హమాస్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలూ నష్టాలకు దారితీశాయని వారు చెప్తున్నారు.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాల నడుమ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్ల రూపాయల్లో కరిగిపోయింది. బీఎస్‌ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.4,46,003.7 కోట్లు తగ్గి రూ.4,57,16,946.13 కోట్ల (5.46 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. బీఎస్‌ఈ లార్జ్‌క్యాప్ 1.08 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం, స్మాల్‌క్యాప్ 0.58 శాతం చొప్పున పడిపోయాయి. ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లో కదలాడగా.. సమయం గడుస్తున్నకొద్దీ మరింత తీవ్రంగా నేలచూపులు చూశాయి.

మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహీంద్రా గ్రూపు పెట్టుబడులపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ఆనంద్ మహీంద్రా అంగీకరించారు.

అమెరికాను భారత్ అందుకోలేదు

- **నాల్గోవంతు తలసరి ఆదాయాన్ని చేరాలన్నా 75 ఏండ్లు పట్టొచ్చు**
- **ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక**

న్యూఢిల్లీ, ఆగస్టు 2: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకే చోదక శక్తి, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధిరేటును సాధిస్తున్న దేశం అంటూ భారత్‌ను కీర్తిస్తున్న వేళ.. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ఓ నివేదిక అందులో నిజమెంత? అన్న అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. రాబోయే కొన్ని దశాబ్దాల్లో భారత్‌సహా 100కుపైగా దేశాలు.. అధిక ఆదాయ దేశాలుగా ఎదిగేందుకు ఎన్నో తీవ్ర అడ్డంకులను ఎదుర్కోవాల్సి రావచ్చని వరల్డ్ బ్యాంక్ హెచ్చరించింది. ఈ క్రమంలోనే అమెరికా తలసరి ఆదాయంలో ఒక్క త్రైమాసికానికి సమానమైన ఆదాయాన్ని చేరాలన్నా.. భారత్‌కు దాదాపు 75 ఏండ్లు పట్టవచ్చని అంచనా వేసింది. ఇదిప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ప్రపంచ అభివృద్ధి నివేదిక 2024: ది మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్ పేరిట తెచ్చిన రిపోర్టులో అమెరికా తలసరి ఆదాయంలో నాల్గోవంతును చేరడానికి చైనాకైతే 10 ఏండ్లు పడుతుందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. ఇండోనేషియాకు 70 ఏండ్లు పట్టవచ్చన్నది.

కటిక దారిద్ర్యం

గత ఏడాది చివరికల్లా భారత్‌సహా 108 దేశాలను మిడిల్ ఇన్‌కమ్ దేశాలుగా వర్గీకరించారు. ఒక్కోదాని వార్షిక జీడీపీ తలసరి ఆదాయం 1,136 డాలర్ల నుంచి 13,845 డాలర్ల మధ్య ఉన్నది. ఈ దేశాల్లో 600 కోట్ల జనాభా ఉండగా.. ఇది ప్రపంచ జనాభాలో 75 శాతానికి సమానం. అలాగే ఈ దేశాల్లో ప్రతీ ముగ్గురిలో ఇద్దరు కటిక దారిద్ర్యంలో మగ్గిపోతుండటం గమనార్హం. ఇదిలావుంటే 1990 నుంచి ఇప్పటిదాకా కేవలం 34 దేశాలే మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థల నుంచి అధిక ఆదాయ ఆర్థిక వ్యవస్థలకు ఎదిగాయని ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రధాన ఆర్థికవేత్త గిల్ తెలిపారు.

రికార్డుస్థాయికి ఐటీ రిటర్నులు

7.28 కోట్ల మంది దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 2: దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారు. 2024-25 అసెస్‌మెంట్ ఏడాదికిగాను 7.28 కోట్ల మంది రిటర్నులు దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ తాజాగా వెల్లడించింది. 2023-24 ఏడాది దాఖలు చేసిన 6.77 కోట్ల కంటే వీరి సంఖ్య 7.5 శాతం అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు జూలై 31 చివరి రోజు 70 లక్షల మంది దాఖలు చేసినట్లు తెలిపింది. ఐటీ రిటర్నులు దాఖలు చేసిన 7.28 కోట్ల మందిలో నూతన పన్ను విధానాన్ని ఎంచుకున్నవారు 5.27 కోట్ల మంది కాగా, పాత పన్నుల విధానాన్ని కొనసాగించిన వారు 2.01 కోట్ల మంది. పన్ను చెల్లింపుదారుల ప్రాధాన్యతలు అంతకంతకు పెరుగుతున్నాయి. . ఈసారి దాఖలు చేసిన వారిలో 72 శాతం మంది ఈ పన్ను విధానాన్ని ఎంచుకోగా, 28 శాతం మంది పాత పన్నుల విధానంలోనే దాఖలు చేశారు. అలాగే కొత్తగా దాఖలు చేసిన వారు 58.57 లక్షల మంది ఉన్నట్లు పేర్కొంది. దాఖలు చేసిన వారిలో ఐటీఆర్-1 కింద 45.77 శాతం(3.34 కోట్లు), ఐటీఆర్-2 కింద 14.93 శాతం(1.09 కోట్లు), ఐటీఆర్-3 కింద 12.5 శాతం(91.10 లక్షలు), ఐటీఆర్-4 కింద 25.77 శాతం(1.88 కోట్లు), ఐటీఆర్-5 నుంచి ఐటీఆర్-7 కింద 1.03 శాతం(7.48లక్షలు) కేటగిరిల కింద దాఖలు చేశారు. వీరిలో 43.82 శాతం మంది ఆన్‌లైన్‌లో ఐటీఆర్ దాఖలు చేయగా, మిగతావారు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.

పన్ను ఎగవేతలు కూడా..

పన్ను చెల్లింపుదారులు పెరిగినట్లే పన్ను ఎగవేతదారులు కూడా రికార్డు స్థాయిలో పెరుగుతున్నారు. గడిచిన పదేండ్లకాలంలో పన్ను ఎగవేతదారులు వెయ్యి రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.9.08 లక్షల కోట్ల పన్ను చెల్లింపులకు సంబంధించి నోటీసులు జారీ అయ్యాయి. 2013014 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.80 వేల కోట్లుగా ఉన్నది.

టార్గెట్ 'ఇన్ఫోసిస్' మూర్తి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ కంపెనీ రూ. 32,403 కోట్ల జీఎస్టీ ఎగవేతకు సంబంధించి కర్ణాటక స్టేట్ జీఎస్టీ అధికారులు ముందస్తు షోకాజ్ నోటీసులు పంపడంపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఐటీ ఉద్యోగులు వారంలో 70 గంటలు పనిచేయాలన్న నారాయణ మూర్తి కామెంట్లను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ఇన్ఫోసిస్ జరిమానా కట్టడానికి ఎక్కువ గంటలు పనిచేయాల్సిందేనని పోస్టులు పెడుతున్నారు. కాగా ఎగవేతకు సంబంధించిన నోటీసులను వెనక్కి తీసుకొంటున్నట్టు జీఎస్టీ అధికారులు తాజాగా వెల్లడించడం గమనార్హం.

జియోథర్మల్ క్షేత్రంగా మణుగూరు!

అన్వేషణ, అభివృద్ధిపై త్రైపాక్షిక ఒప్పందం

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): భూతాపం ఆధారంగా విద్యుదుత్పత్తికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరును జియోథర్మల్ క్షేత్రంగా అభివృద్ధి చేయనున్నారు. అక్కడ 122 మెగావాట్ల జియోథర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి మూడు సంస్థలు సిద్ధమవుతున్నాయి. మణుగూరు సమీపంలోని పగిడేరు వద్ద ఏర్పాటు చేయడానికి శుక్రవారం సింగరేణి, ఓఎన్‌జీసీ, తెలంగాణ రెడ్కోల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. దీనికి సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, ఓఎన్‌జీసీ డైరెక్టర్ సుష్మారావత్, రెడ్కో జీఎం సత్యవరప్రసాద్‌లు హాజరయ్యారు. ఇప్పటికే 20 కిలోవాట్ల విద్యుదుత్పత్తికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమవ్వగా, 122 మెగావాట్లకు వీలుందని ఓఎన్‌జీసీ నివేదిక వెల్లడించింది. మరికొన్ని పరిశోధనల్లో 3,500 మోగావాట్ల వరకు జియోథర్మల్ విద్యుదుత్పత్తికి అవకాశమున్నట్లుగా తేలింది.

రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి..

రోజుకు 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి సీఎండీ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు.

బొగ్గుబావుల ప్రైవేటీకరణపై అసెంబ్లీలో తీర్మానించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బొగ్గుబావుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 29న పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సింగరేణి పరిరక్షణ యాత్ర ఈ నెల 5వ తేదీన కొత్తగూడెంలో ముగుస్తుందని చెప్పారు. ముగింపు సభకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు విజయరాఘవన్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ప్రత్యక్షంగా 40వేలు, పరోక్షంగా 20వేలు మొత్తంగా లక్ష కుటుంబాల వరకు సింగరేణి సంస్థపై ఆధారపడి జీవిస్తున్నాయని, సంస్థను ప్రైవేటీకరిస్తే ఆ కుటుంబాలన్ని రోడ్డునపడే ప్రమాదముందన్నారు. ఏటా రూ.6 లక్షల కోట్ల వార్షిక ఆదాయంతోపాటు లాభాల్లో నడుస్తున్న సింగరేణి సంస్థను ప్రైవేటీకరించాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. బీజేపీ విధానాలను బలంగా అడ్డుకోకుంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశం ఉండదని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, విక్రమ్ పాల్గొన్నారు.

దళితబంధు లబ్ధిదారులకు త్వరలో పూర్తి లబ్ధి

కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, ఆగస్టు 2: దళితబంధు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పూర్తి లబ్ధిని అందించేలా వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. చింతకాని మండల ప్రత్యేకాధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. చింతకాని మండలంలోని 3,462 మందికి దళితబంధు పథకం కింద వివిధ రకాల యూనిట్లను మంజూరు చేసి గ్రౌండింగ్ చేసినట్లు చెప్పారు. అందులో 1,888 మందికి పూర్తి మొత్తమైన రూ.10 లక్షలు అందగా.. మిగతా వారికి వారి ఎంపిక ప్రకారం పాక్షిక మొత్తం అందింది. అయితే, మిగతా లబ్ధిని అందించేందుకు అధికారులు పూర్తి వివరాలు వెంటనే అందజేయాలని ఆదేశించారు. శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, అధికారులు సన్యాసయ్య, వినోద్, నవీన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి అధ్యయనాలు అవసరం: కలెక్టర్

క్షేత్రస్థాయి అధ్యయనాలు అవసరమని, విధుల నిర్వహణకు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ తెలిపారు. భారత ప్రభుత్వ సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీసెస్ అసిస్టెంట్ సెక్షన్ అధికారులతో ఖమ్మంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. వారి క్షేత్రస్థాయి అనుభవాల గురించి చర్చించారు. అధికారులు సన్యాసయ్య, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్మీ శిక్షణ కేంద్రానికి స్థలం అప్పగించాలి

ఆర్మీ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు రఘునాథపాలెంలో మంజూరుచేసిన 1.23 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ఆర్మీ అధికారులు శుక్రవారం కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌ని కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి కోరారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లే దారిలో గల ఎన్‌సీసీ బెటాలియన్ కార్యాలయాన్ని పాత సబ్‌జైలుకు మార్చే అంశం గురించి కలెక్టర్‌తో ఎన్‌సీసీ కమాండెంట్ చర్చించారు. అయితే జైళ్లశాఖ డీజీని సంప్రదించి చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలు జాగ్రత్త..!

- **వర్షాలకు తగిన చర్యలు తప్పనిసరి**
- **రైతులకు ఉద్యానవన శాస్త్రవేత జి.విజయకృష్ణ సూచన**

ఆయిల్‌పామ్‌లో మొవ్వకుళ్లు

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 2 : ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, వాతావరణంలోని తేమ కారణంగా ఉద్యాన పంటల్లో తగిన చర్యలు తీసుకోవాలని అశ్వారావుపేట ఉద్యాన పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ జి.విజయకృష్ణ రైతులకు సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగవుతున్న వివిధ పంటల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను శుక్రవారం 'నమస్తే'కు వివరించారు.

ఆయిల్‌పామ్..

లేత, ముదురు తోటల్లో నీరు నిలిస్తే సాధ్యమైనంత త్వరగా మొదళ్ల దగ్గర నుంచి వర్షపు నీరు పోయాలా ఏర్పాటు చేసుకోవాలి. లేత తోటల్లో 1 శాతం, కార్బెండిజం ద్రావణాన్ని మొక్కభాగంలో తడిచేలా పిచికారీ చేయాలి. దీంతో మొవ్వుకుళ్లు రాకుండా అరికట్టవచ్చు. లేత తోటల్లో ఆకుతినే పురుగును నివారించడానికి వేపనూనె పిచికారీ చేయాలి. లేత, ముదురు తోటల్లో కొమ్ము పురుగు నివారణకు తోటలోని పెంటకుప్పలపై మెటారైజియం అనే శీలింద్రం వాడి నివారించాలి. కొమ్ము పురుగు ఉధృతి నివారించడానికి ఎకరానికి 1 లేదా 2 లింగాకర్షణ బుట్టలను వాడాలి. వేలాడుతున్న ఆకుమట్టలను తొలగించాలి. ముదురు తోటల్లో మొక్కలు త్వరగా కోలుకోవడానికి సిఫార్సు చేసిన ఎరువులను వేసుకోవాలి.

అరటి..

లేత, ముదురు తోటల్లో నిలిచిన నీటిని త్వరగా బయటకు పంపాలి. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత లేత తోటల్లో తేమ త్వరగా ఆరడానికి అంతర కృషి చేయాలి. గెలలు ఏర్పడని లేత అరటి మొక్కల్లో వర్షం, గాలి కారణంగా పూర్తిగా వాలితే 1 లేదా 2 ఆరోగ్యవంతమైన సూది పిలకలను వదిలేసి వాలిన మొక్కను పూర్తిగా తొలగించాలి. ఒకవేళ బాగా వృద్ధి చెందుతున్న అరటిచెట్టు వాలితే వెదురు కర్రలతో ఊతమిచ్చి సాధ్యమైనంత త్వరగా 15 లేదా 20 రోజుల్లో గెలలను మార్కెట్ చేసుకోవాలి. తుపాన్ తాకిడికి గురైన తోటల్లో 2 శాతం యూరియా లేదా కేఎన్‌వో-3 ద్రావణాన్ని రెండుసార్లు పిచికారీ చేయాలి. త్వరగా మొక్కలు కోలుకోవడానికి మొక్కకు 80 గ్రాముల మ్యూరియెట్ ఆఫ్ పొటాష్ 100 గ్రాములు, యూరియా చొప్పున 2, 3 దఫాలు అందించాలి. వర్షం పూర్తిగా తగ్గిన తర్వాత సిగటోక ఆకు మచ్చ తెగులు వ్యాపించకుండా ప్రాపికోనాజోల్ 0.1 శాతం ద్రావణాన్ని రెండు, మూడు సార్లు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

జీడిమామిడి..

తోటల్లో నిలిచిన నీటిని త్వరగా బయటకు పంపాలి. లేత తోటల్లోని మొక్కలు వాలితే మట్టి ఎగదోసి నిలబెట్టాలి. ముదురు తోటల్లో విరిగిన కొమ్మలను కత్తిరించి బోర్డో పేస్ట్‌ను పూయాలి.

కూరగాయలు..

తోటల్లో నిలిచిన నీటిని బయటకు పంపి వాలిన మొక్కలకు మట్టి ఎగదోసి నిలబెట్టాలి. 1 లీటరు నీటిలో 2.5 గ్రాముల మంకోజెబ్ లేదా 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, 2 గ్రాముల స్టేఫ్ సైక్లిన్ కలిపి పిచికారీ చేసిన బాక్టీరియా, శీలింద్రం తెగుళ్లను అరికట్టవచ్చు.

బొప్పాయి..

లేత, కాత దశలో ఉన్న తోటల్లో సాధ్యమైనంత త్వరలో వర్షం నీటిని బయటకి పంపించాలి. మొక్క మొదళ్లలో బోర్డో మిశ్రమం 1 శాతం తడిపితే కాండం మొదలు కుళ్లు రాకుండా అరికట్టవచ్చు. తుపాన్ తాకిడికి గురైన తోటల్లో 2 శాతం యూరియా లేదా 0.5 కేఎన్‌వో-3 ద్రావణాన్ని రెండుసార్లు పిచికారీ చేసిన మొక్కలు త్వరగా కోలుకుంటాయి. వాలిన మొక్కలకు మట్టి ఎగదోయడం, వెదురు కర్రలతో ఊతం అందించాలి. కాయ కోతకు సిద్ధమైన కాయలు, రాలిన కాయలను సాధ్యమైనంత త్వరగా మార్కెట్ చేసుకోవాలి.

247 కిలోల గంజాయి పట్టివేత

ఆరుగురి అరెస్ట్, పరారీలో మరో ఆరుగురు

వివరాలు వెల్లడించిన పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్



సారపాకలో వాహన తనిఖీల్లో పట్టుకున్న గంజాయి, నిందితులు, వాహనాలతో పోలీసులు

సారపాక, ఆగస్టు 2 : సీలేరు నుంచి హైదరాబాద్‌కు రెండు కార్లలో తరలిస్తున్న 247 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. బూర్గంపహాడ్ ఎస్సై ఇ.రాజేశ్, టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు ప్రవీణ్, సుమన్, పోలీసు సిబ్బంది సారపాక శివారులో తనిఖీలు నిర్వహిస్తుండగా.. భద్రాచలం వైపు నుంచి మణుగూరు క్రాస్ రోడ్ వైపు మూడు కార్లు వస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు వాటిని ఆపి తనిఖీ చేయగా ఆరుగురు వ్యక్తులతోపాటు గంజాయి లక్ష్యమైంది. పట్టుబడిన వారిలో ఏపీ రాష్ట్రం అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన తనోజ్ హర్షిత్, హైదరాబాద్ మంగళ్‌హట్ గంగబోడికి చెందిన కిషన్‌కుమార్‌దాస్, జనగామ జిల్లా కొడకండ్ల మండలం రేగుల గ్రామానికి చెందిన భూక్యా దేవేందర్, బూర్గంపహాడ్ మండలం సారపాక గాంధీనగర్, తాళ్లగొమ్మూరుకు చెందిన రావులపల్లి ప్రతాప్, ములగాడ అన్వేష్, హైదరాబాద్ బంజారాహిల్స్‌కు చెందిన బావికాడి శ్రీనివాస్ ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు. మూడు కార్లలో ఒక వాహనం ముందు పైలెట్ వాహనం వెళ్తుండగా.. వెనుక ఉన్న రెండు కార్లలో 247 కిలోల రూ.80 లక్షల విలువైన గంజాయిని తరలించే ప్రయత్నం చేశారని తెలిపారు. అయితే వీరితో కలిసి గంజాయి వ్యాపారం చేసే సారపాకకు చెందిన ప్రధాన నిందితుడు శివశంకర్‌రెడ్డి సీలేరు నుంచి గంజాయిని కిల్లో మోహన్, పోటేరు మోహనరావు, రామారావుల ద్వారా సేకరించి హైదరాబాద్‌లోని మహేందర్‌సింగ్ అనే వ్యక్తికి ఇచ్చేందుకు వెళ్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి రవాణాకు కారును ఏర్పాటు చేసిన జనగామకు చెందిన లతీఫ్ కూడా ఇందులో భాగస్వామిగా ఉన్నట్లు తెలిపారు. తనిఖీల్లో పై ఆరుగురు వ్యక్తులు పట్టుబడగా.. ప్రధాన నిందితుడు శివశంకర్‌రెడ్డితోపాటు మహేందర్‌సింగ్, కిల్లో మోహన్, పోటేరు మోహన్‌రావు, రామారావు, లతీఫ్‌లు పరారీలో ఉన్నారని, వీరిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వివరించారు. ఇదిలా ఉండగా.. పరారీలో ఉన్న శివశంకర్‌రెడ్డిపై ఇప్పటికే 10 కేసులు ఉన్నట్లు తేలిందని, కిషన్‌కుమార్‌దాస్‌పై రెండు, తనోజ్ హర్షిత్, మునగాడ అన్వేష్‌పై ఒక్కో కేసు నమోదైందని వివరించారు. గంజాయితో పట్టుబడిన నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు. సమావేశంలో పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, బూర్గంపహాడ్ ఎస్సైలు రాజేశ్, నాగభిక్షం, టాస్క్‌ఫోర్స్ సీఐ సత్యనారాయణ, ఎస్సైలు ప్రవీణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

జియో థర్మల్ క్షేత్రంగా మణుగూరు

త్రైపాక్షిక ఒప్పంద పత్రాలపై సంతకాలు

వివరాలు వెల్లడించిన సింగరేణి సీఎండీ బలరాం



సంతకాలు చేసుకున్న పత్రాలను చూపిస్తున్న సింగరేణి సీఎండీ, అధికారులు

కొత్తగూడెం సింగరేణి, ఆగస్టు 2 : సింగరేణి పరిధిలోని మణుగూరు పట్టణానికి సమీపంలోని పగిడేరు వద్ద భూగర్భంలో విస్తారంగా ఉన్న భూతాప(జియో థర్మల్) క్షేత్రం అన్వేషణ, అభివృద్ధిపై సింగరేణి కాలరీస్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్(ఓఎన్‌జీసీ), తెలంగాణ రిన్యువబుల్ ఎనర్జీ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(తెలంగాణ రెడ్కో) మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ బలరాం, ఓఎన్జీసీ డైరెక్టర్ సుష్మా రావత్, తెలంగాణ రెడ్కో జీఎం సత్యవరప్రసాద్‌లు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ మాట్లాడుతూ మణుగూరులో 122 మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించిందన్నారు. సింగరేణి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం దిశగా ముందుకు వెళ్తోందని, ఇందులో భాగంగానే మణుగూరులో జియో థర్మల్ క్షేత్ర అన్వేషణలో ఓఎన్జీసీ, తెలంగాణ రెడ్కోతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. దేశం 2070 నాటికి సంపూర్ణ కార్బన్ ఉద్గార రహిత విద్యుత్ ఉత్పత్తే లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణ, ఎన్వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎంలు సుభాని, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.